క్లుప్తంగా...

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.23, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 23, పచ్చిమిర్చి 40, బజ్జీమిర్చి 45, క్యాప్సికమ్ 33, పచ్చకాకర 32, పందిరి బీర 23, క్యాబేజీ 15, క్యారెట్ 35, దొండ 28, గుండుబీన్స్ 50, గింజ చిక్కుడు 45, గోకరకాయ 23, కీర 20, దోసకాయ 28, బీట్‌రూట్ 21, ఉల్లిగడ్డ 28, ఆలుగడ్డ 21, చామగడ్డ 33, మొరంగడ్డ 40, కందగడ్డ 47, సొరకాయ 13, పొట్లకాయ 18, అరటికాయ 11, మునగకాయ 3–4, ముల్లంగి 4–6. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

భక్తిశ్రద్ధలతో చండీహోమం

సనత్‌నగర్: నిజశ్రావణ మాసం శుద్ధ పౌర్ణమి సందర్భంగా సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానం దుర్గామాత అమ్మవారి ఆలయంలో గురువారం చండీహోమం నిర్వహించారు. ఈఓ శ్రీనివాసరాజు పర్యవేక్షణలో అర్చకులు సుదర్శనాచార్యుల ఆధ్వర్యంలో జరిగిన చండీ హోమం కార్యక్రమానికి భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే శివాలయం అర్చకులు రిపుంజయశర్మ ఆధ్వర్యంలో మల్లికార్జున స్వామివారిని ప్రత్యేకంగా రాఖీలతో అలంకరించిన తీరు భక్తులను ఆకట్టుకుంది. సంతోషి మాత అమ్మవారి పుట్టినరోజు సందర్భంగా 108 కలశాలతో ప్రత్యేక అభిషేకం, విశేష పుష్పాలంకరణ చేశారు.

సాయిబాబా దేవాలయం ప్రారంభం


దేవాలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్న మంత్రి తలసాని

బన్సీలాల్‌పేట్: బన్సీలాల్‌పేట్ డివిజన్ చాచానెహ్రూనగర్‌లో గురువారం సాయిబాబా దేవాలయాన్ని రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మానసిక ప్రశాంతతకు మనిషి ఎదుగుదలకు ఆధ్యాత్మిక చింతన ఎంతో దోహదపడుతుందన్నారు. భగవాన్ శ్రీ సాయిబాబా ఆశీస్సులతో ప్రజలు సుఖ సంతోషాలతో విరజిల్లాలన్నారు. పూజలో శాంతికుమార్, మహేష్, కమల్‌కుమార్ పాల్గొన్నారు.

అన్నదానం

రసూల్‌పురా: అన్నిదానాల కన్నా అన్నదానం మిన్న అని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నరసింహన్ అన్నారు. శ్రావణ పూర్ణిమ సందర్భంగా కంటోన్మెంట్ నియోజకవర్గం బొల్లారం డౌటన్ బజార్ భూలక్ష్మమ్మ దేవాలయం వద్ద గురువారం నిర్వహించిన అన్నదాన కార్యక్రమం ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అరవింద్, మల్లారెడ్డి, బాల్‌రాజ్, భరత్, విజయ్. విష్ణు డాంజల్, హరిష్, ప్రేమ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ బీసీ డిక్లరేషన్ కమిటీ మెంబర్‌గా సురేష్‌లాల్



లాలాపేట: కాంగ్రెస్ పార్టీ బీసీ డిక్లరేషన్ కమిటీ మెంబర్‌గా తార్నాక డివిజన్ లాలాపేటకు చెందిన ఆ పార్టీ సీనియర్ నాయ కులు నేతికార్ సురేష్‌లాల్ నియమితులయ్యారు. ఇటీవల టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి బీసీ డిక్లరేషన్ కమిటీని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్ గౌడ్ ప్రకటించిన పేర్లలో సురేష్‌లాల్‌కు సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి స్థానం లభించింది.

3న మున్నూరు కాపు జేఏసీ సమావేశం

కాచిగూడ: మున్నూరు కాపు జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 3న మధ్యాహ్నం 2 గంటలకు బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలోని షోయబ్ హాల్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు ఎడ్ల రవి పటేల్ తెలిపారు. మున్నూరు కాపు కార్పొరేషన్ సాధన, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మున్నూరు కాపు అభ్యర్థులను గెలిపించుకోవడం తదితర అంశాలపై సమావేశంలో చర్చించి తగు నిర్ణయాలు తీసుకుంటామన్నారు. మున్నూరు కాపులు అధిక సంఖ్యలో పాల్గొని తమ సూచనలు, సలహాలు ఇచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు

చిక్కడపల్లి: వివేక్‌నగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో గురువారం శ్రావణపౌర్ణమి సందర్భంగా సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు అత్యంత భక్తి శ్రద్ధాలతో నిర్వహించారు. ఈ సందర్భంగా చండీ హోమంతో పాటు భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గుండెపూడి మురళీ ప్రసాద్, ఈఓ మాచర్ల దేవనాథం, ఆలయ ధర్మకర్తలు మురికిగణేష్, జీకే రమణ, డాక్టర్ రామకృష్ణ, పద్మ బాసాని, అర్చకులు బుగ్గ లక్ష్మీపతిశర్మ, వెంకటాద్రి, ఆచారి పాల్గొన్నారు.

అన్నా చెల్లెళ్ల అనుబంధం.. రక్షాబంధన్


మర్రి రాజశేఖర్ రెడ్డికి రాఖీ కడుతున్న మల్లారెడ్డి హెల్త్ సిటీవైస్ చైర్మన్ డాక్టర్ ప్రీతి

అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పౌర్ణమిని గురువారం సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ నియోజకవర్గాల్లో ఘనంగా నిర్వహించుకున్నారు. తమ్ముళ్లకు అక్కలు, అన్నలకు చెల్లెళ్లు రాఖీలు కట్టి తమ సోదరభావాన్ని చాటుకున్నారు. కులమతాలకతీతంగా ఆత్మీయ, అనురాగ బంధాన్ని చాటి చెప్పారు. దూర ప్రాంతాల్లో ఉంటున్న అన్నలు, తమ్ముళ్ల వద్దకు అక్కాచెల్లెళ్లు వెళ్లి రాఖీలు కట్టి తమ బంధాన్ని చాటి చెప్పారు. –సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్


మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు రాఖీలు కడుతున్న మహిళలు


మాధవరం కృష్ణారావుకు రాఖీ కడుతున్న కార్పొరేటర్ మహేశ్వరిశ్రీహరి


సాయిబాబాకు రాఖీ కడుతున్న ముస్లిం మహిళలు


పద్మారావు గౌడ్‌కు రాఖీ కడుతున్న సోదరి శకుంతల


రాఖీ పండుగ జరుపుకుంటున్న అన్నా చెల్లెలు


క్రిశాంక్‌కు రాఖీ కట్టిన స్థానిక మహిళలు


గజ్జల నాగేష్ కు రాఖీ కడుతున్న మహిళలు


సోదరితో రాఖీ కట్టించుకున్న ఆర్‌బీ నరేష్


రాఖీ వేడుకల్లో మహిళలకు గిఫ్ట్‌లను అందజేసిన డాక్టర్ రవీందర్‌గౌడ్


మోతే శోభన్‌రెడ్డికి రాఖీలు కడుతున్న మహిళలు


అక్కాచెల్లెళ్లతో ఓ సోదరుడు...


బన్సీలాల్‌పేట్‌లో తమ్ముడికి రాఖీ కడుతున్న అక్క


భోలక్‌పూర్‌లో మర్రి ఆదిత్యరెడ్డికి రాఖీలు కట్టిన స్థానిక మహిళలు

ఘనంగా సంతోషిమాత జన్మదినోత్సవాలు


అమ్మవారిని దర్శించుకున్న లాస్య నందిత

రాంగోపాల్‌పేట్: రెజిమెంటల్‌బజార్ కాశీ విశ్వనాథ స్వామి దేవాలయంలోని సంతోషీమాత అమ్మవారి వార్షిక జన్మదినోత్సవాలు గురువారం కనుల పండువగా జరిగాయి. పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఈవో మహేందర్‌గౌడ్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉదయం 5.30 గంటలకు అమ్మవారికి శుద్ధి, ఆవుపాలు, కొబ్బరి బోండా జలాలు, తేనె, నెయ్యి, చక్కెర, సుగంధ ద్రవ్యాలు, కలశాలతో అభిషేకాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం అమ్మవారికి అలంకార పూజతో పాటు వివిధ రకాల పూజలు నిర్వహించారు. సాయంత్రం రెజిమెంటల్‌బజార్‌లోని పురవీధుల్లో రథోత్సవాన్ని నిర్వహించారు. డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతరెడ్డి, కార్పొరేటర్ కొంతం దీపిక, లాస్య నందిత నాయకులు నరసింహారావు ముదిరాజ్, టీఎస్ శ్రీనివాస్, చిన్న, కసిరెడ్డి నరేందర్‌రెడ్డి, సదానంద్‌గౌడ్ పూజల్లో పాల్గొన్నారు.

మహిళాభ్యున్నతికి కృషి

సనత్‌నగర్: డాక్టర్ మర్రి చెన్నారెడ్డి ఫౌండేషన్, సావిత్రమ్మ స్కిల్ సెంటర్ ద్వారా మహిళలు జీవనోపాధి నైపుణ్యాలతో పాటు సాధికారత కల్పిస్తామని టీపీసీసీ సభ్యులు మర్రి ఆదిత్యరెడ్డి హామీనిచ్చారు. భోలక్‌పూర్, బర్తన్ కాంపౌండ్, అమీర్‌పేట కుమ్మరిబస్తీలలో బుధవారం ఆయన పర్యటించారు. బర్తన్ కాంపౌండ్‌లో అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధుడికి ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం అమీర్‌పేట డివిజన్ కుమ్మరిబస్తీలో పర్యటించి కుమ్మరుల కష్టాలు తెలుసుకుని వారికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు సాధికారత సాధించి అధిక ఆదాయాలు పొందాలనేదే తమ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో విఠల్, డాక్టర్ శివకుమార్‌లాల్, జగదీష్, సాయిగౌడ్, కృష్ణయాదవ్, శైలేష్, శ్యాం, విలాస్‌రావు, నరేష్, శంకర్, కాంతారావు, దశరథ్, ఆర్.కృష్ణ, బసవరాజు పాల్గొన్నారు.


కుండల తయారీని తిలకిస్తున్న మర్రి ఆదిత్యరెడ్డి

మేథో సంపత్తి హక్కులపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న ప్రొ.జీబీ రెడ్డి

ఉస్మానియా యూనివర్సిటీ: మేథో సంపత్తి హక్కుల (ఐపీఆర్) పై పరిశోధన విద్యార్థులు, అధ్యాపకులకు అవగాహన అవసరమని ఓయూ న్యాయకళాశాల ప్రొఫెసర్ జీబీ రెడ్డి అన్నారు. గురువారం క్యాంపస్‌లోని సైన్స్ కాలేజీ ఆడిటోరియంలో తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (టీఎస్‌సీహోఎస్‌టీ), ఓయూ ఐపీఆర్ సెల్ ఆధ్వర్యంలో ఐపీఆర్‌పై నిర్వహించిన అవగాహన సదస్సుకు ప్రొ.జీబీ రెడ్డి హాజరై మాట్లాడారు. విద్యావేత్తలు, పరిశోధకులు తమ పరిశోధనలు, ఆవిష్కరణలు(కనుగొన్న నూతన అంశాలు) ప్రచురించే ముందు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమాచారాన్ని వినియోగించుకునే ముందు ఆయా అంశాలపై లోతైన పరిశీలనతో పాటు మేథో సంపత్తి హక్కులపై స్పష్టత తీసుకోవడం అవసరమన్నారు. ప్రిన్సిపల్ ప్రొ.వీరయ్య, సైన్స్ డీన్ ప్రొ.కరుణసాగర్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ చెన్నరెడ్డి, టీఎస్‌సీహోఎస్‌టీ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ రాధిక ప్రసంగించారు.

చిరు ధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం


మాట్లాడుతున్న మురళీధర్ రావు

రసూల్‌పురా: చిరుధాన్యాలను ప్రోత్సహిస్తే సమాజానికి మేలు చేకూరుతుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. గురువారం కంటోన్మెంట్ నియోజకవర్గం తిరుమలగిరి బంజారా నగర్‌లో కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మిల్లెట్ మేళాలో చిరుధాన్యాలతో వండిన అల్పాహారాన్ని సందర్శకులకు అందజేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన బీజేపీ సీనియర్ నాయకులు మురళీధర్ రావు మాట్లాడుతూ.. నేటి యువత పిజ్జా, బర్గర్‌లకు అలవాటు పడుతూ అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని యువతకు చిరుధాన్యాల ప్రాముఖ్యత తెలియజేయడానికి ఇలాంటి మేళా కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ కార్యదర్శి వైవీ. రావు, అమర్‌నాథ్. బీజేపీ నేత సుష్మిత కాలనీవాసులు పాల్గొన్నారు.

3న ల్యాప్‌టాప్, స్కాలర్‌షిప్‌ల పంపిణీ


బ్రోచర్‌ను ఆవిష్కరించిన వెల్లాల రామ్మోహన్

సనత్‌నగర్: పేద విద్యార్థులకు చేయూతనందించే లక్ష్యంతో బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య (బీఎస్‌ఎస్‌ఎస్) తెలంగాణ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 3న ల్యాప్‌టాప్, స్కాలర్‌షిప్‌ల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత వెల్లాల రామ్మోహన్ అన్నారు. కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్‌ను గురువారం కార్యాలయంలో ఆవిష్కరించి మాట్లాడారు. సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానం ప్రాంగణంలోని అన్నపూర్ణ భవనంలో జరిగే ఈ బృహత్తర కార్యక్రమంలో 200 మందికి ల్యాప్‌టాప్‌లు, స్కాలర్‌షిప్పులు అందజేయడం జరుగుతుందన్నారు. ముఖ్య అతిథిగా టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, విశిష్ట అతిథులుగా మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్సీ వాణీదేవి, మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు, నీటి పారుదల కార్పొరేషన్ చైర్మన్ వేణుగోపాలాచారిలు హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ అర్చక, ఉద్యోగ జేఏసీ కన్వీనర్ పరాశరం రవీంద్రాచార్యులు, సమాఖ్య ప్రతినిధులు ఎంవీ శాస్త్రి, రామచంద్రమూర్తి, విజయలక్ష్మీ, పంచగంగేశ్వర్, రవీంద్ర, సోమయాజులు, ఉపేంద్రకుమార్ పాల్గొన్నారు.

రైల్వేలో 68 మంది పదవీ విరమణ


పదవీ విరమణ పొందిన వారికి వీడ్కోలు పలుకుతున్న దృశ్యం

అడ్డగుట్ట: దక్షిణ మధ్య రైల్వేలో వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న 68 మంది ఉద్యోగులు గురువారం పదవీ విరమణ చేశారు. హెడ్ క్వార్టర్స్, సికింద్రాబాద్, హైదరాబాద్ డివిజన్లతో పాటు లాలాగూడ వర్క్‌షాప్‌లో విధులు నిర్వహించారు. నిర్మాణ్ భవన్ అకౌంట్స్ అధికారి మన్సూర్ హుస్సేన్, లేఖా భవన్ ట్రావెలింగ్ ఇన్‌స్పెక్టర్ మధు, రతన్‌రాజు, బాలకృష్ణ, గజాధర శర్మ, హైదరాబాద్ డివిజన్‌లో శ్రీనివాస్, రఘునాథ్‌ను ఎంప్లాయిస్ సంఘ మీడియా కో–ఆర్డినేటర్ షేక్ రవూఫ్, కార్యదర్శి చింతకుంట రామకృష్ణ శాలువా ఆత్మీయ వీడ్కోలు పలికారు.

మండల స్థాయి క్రీడాపోటీల్లో సత్తా


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ శ్రీవాణి

అడ్డగుట్ట: అన్ని రంగాల్లో విద్యార్థులు తమ ప్రతిభ కనబరుస్తూ ముందుకు దూసుకెళ్లాలని అడ్డగుట్ట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రిన్సిపల్ శ్రీవాణి అన్నారు. ఇటీవల నిర్వహించిన మారేడ్‌పల్లి మండలస్థాయి కోకో పోటీల్లో అడ్డగుట్ట ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థులు రెండో స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపల్ శ్రీవాణి అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో తమదైన శైలిలో దూసుకుపోతుండడం అభినందనీయమన్నారు. పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు జిల్లాస్థాయి కోకో, కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో చండీ హోమం

నల్లకుంట: పౌర్ణమి సందర్భంగా గురువారం నల్లకుంట శంకర మఠంలోని శారదా మాతకు ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. అనంతరం మఠం ప్రాంగణంలోని యాగశాలలో పండితుల మంత్రోచ్ఛరణల నడుమ చండీ హోమం నిర్వహించారు. నవధాన్యాలు, పసుపు, కుంకుమ, కొబ్బరి కాయలు, సుగంధ ద్రవ్యాలు, అమ్మవారికి సమర్పించిన నూతన వస్త్రాలు హోమంలో వేసి ఆవు నెయ్యితో పూర్ణాహుతి కావించారు. అలాగే ఆలయంలోని అమ్మవారికి చండీ పూజలు చేశారు. పూజల్లో శంకరమఠం నల్లకుంట బ్రాంచ్ హెడ్ కె.కృష్ణారావు దంపతులతో పాటు పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేసి, మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

శ్మశాన వాటికల అభివృద్ధికి కృషి



ముషీరాబాద్: ముషీరాబాద్ నియోజకవర్గంలోని అన్ని శ్మశాన వాటికలను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని స్థానిక ఎమ్మెల్యే ముఠా గోపాల్ తెలిపారు. అడిక్‌మెట్ డివిజన్‌లోని ముస్లిం కబరస్తాన్‌లో గుసల్‌ఖానా, వాజుఖానా, పవర్ బోర్ ఏర్పాటుకు 11 లక్షల రూపాయల నియోజకవర్గ అభివృద్ధి నిధులను కేటాయించారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్ గురువారం ఈ పనులను ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ముఠా జైసింహ, కబరస్తాన్ కమిటీ అధ్యక్షులు ఖామిల్, అబ్దుల్ రహీం, వైస్ ప్రెసిడెంట్ సయ్యద్ యూనుస్, హబీద్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు మనోహర్‌సింగ్, మహ్మద్ జహంగీర్, మహ్మద్ ఖదీర్, అబూ, షేక్ మహ్మద్, బషీర్, వాయబ్, సిద్ధిఖ్, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం


సత్తెయ్య

చిలకలగూడ: ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో చోటు చేసుకుంది. చిలకలగూడ ఎస్‌ఐ ఆంజనేయులు వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా సాగర్‌రింగ్‌రోడ్ బీఎస్ నగర్‌కు చెందిన సత్తెయ్య (40) వజ్రమ్మ భార్యాభర్తలు. అస్వస్థతకు గురైన తమ కుమార్తె స్వాతి చికిత్స నిమిత్తం ఆగస్టు 14న గాంధీఆస్పత్రిలో చేర్పించారు. ఈ నెల 18న వార్డు నుంచి బయటకు వెళ్లిన సత్తె య్య తిరిగి ఆస్పత్రికి రాలేదు. సన్నిహితులు, బంధువులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో సోదరుడు బ్రహ్మయ్య ఫిర్యాదు చేశాడు.

యువతి స్నానం చేస్తుండగా వీడియో తీసిన యువకుడి అరెస్టు

అమీర్‌పేట్: యువతి స్నానం చేస్తుండగా రహస్యంగా సెల్‌ఫోన్‌లో వీడియో చిత్రీకరిస్తున్న యువకుడిని ఎస్‌ఆర్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు. ఇన్‌స్పెక్టర్ రామప్రసాద్‌రావు వివరాల ప్రకారం.. ఎస్‌ఆర్‌నగర్‌లో ఉంటున్న ఓ యువతి (22) బుధవారం రాత్రి బాత్రూమ్ స్నానం చేస్తుండగా వెంటిలేషన్ నుంచి ప్రశాంత్ అనే యువకుడు సెల్‌ఫోన్‌లో వీడియో తీస్తుండగా గమనించిన యువతి కేకల వేయడంతో పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ప్రశాంత్‌ను అరెస్టు చేసి కేసు నమోదు చేశామన్నారు.

ప్రజలందరి సంక్షేమానికి ముఖ్యమంత్రి కృషి

చిక్కడపల్లి: ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజలందరి సంక్షేమం కోసం కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలయాల్లో ధూపదీప నైవేద్యం, వేతనం రూ.6 వేల నుంచి రూ.10 వేల వరకు పెంచిన సందర్భంగా గురువారం ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని లక్ష్మీ గణపతి ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఠాగోపాల్ మాట్లాడుతూ, కేసీఆర్ ఇచ్చిన మాట ప్రకారం ధూపదీప నైవేద్యం, వేతనం రూ.6 వేల నుంచి రూ.10 వేల వరకు పెంచడం హర్షణీయమన్నారు. ముఠా జైసింహ, ఈఓ లక్ష్మారెడ్డి, ఎం.రాకేష్‌కుమార్, కిరణ్‌కుమార్, రాజ్‌కుమార్, సి.వెంకట గోవిందరావు, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

కాచిగూడ: తెలంగాణ భావ్‌సార్ క్షత్రియ మహిళా పరిషత్ నూతన కార్యవర్గం ఎన్నిక కాచిగూడ, సుందర్‌నగర్‌లోని భావ్‌సార్ భవన్‌లో గురువారం జరిగింది. అధ్యక్షురాలిగా విజయలక్ష్మి సూత్రవే, ప్రధానకార్యదర్శిగా సంగీత పాటాలేతో పాటు వివిధ పదవులకు మహిళలు ఎన్నికయ్యారు. అనంతరం వీరంతా ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో సమాజ భూషణ్ రాజశ్రీ సూత్రవే, వసంత బగాడే, ఉమా రతన్ పాల్కే, అరుణ్‌జ్యోతి లోఖండే, అనితా లోఖండే, స్వర్ణ భాండేకర్ తదితరులు మాట్లాడారు. వివిధ జిల్లాలకు చెందిన మహిళా ప్రతినిధులు మరాఠీ సంస్కృతీ సంప్రదాయాల ప్రకారం నిర్వహించిన కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.